https://www.telugudesam.org



చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





ఆగిన అమరావతి పరిస్థితిపై ఆరా..!

5



భారత ప్రధానిగా నరేంద్రమోదీతో ప్రమాణ స్వీకారం చేయిస్తోన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



కేంద్ర కేబినెట్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన పవన్‌కళ్యాణ్, నితీష్‌కుమార్, చంద్రబాబు తదితరులు

## భారీగా కొలువుదీరిన

# మోదీ సర్కార్

## 3.0 ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణం





- రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నడ్డాసహా సీనియర్లకు చోటు
- కేబినెట్‌లోకి మాజీ సీఎంలు చౌహాన్, మనోహర్‌లాల్, కుమారస్వామి
- తెలుగు రాష్ట్రాల నుంచి రామ్మోహన్ నాయుడు, కిషన్‌రెడ్డి
- సహాయ మంత్రులుగా పెమ్మసాని, శ్రీనివాసవర్మ, బండి సంజయ్
- 81మంది మంత్రులకు తావుండగా 72మంది ప్రమాణ స్వీకారం
- 30మంది కేబినెట్ మంత్రుల్లో తొమ్మిది కొత్త ముఖాలు
- ఐదుగురు స్వయంప్రతిపత్తి కల్గిన సహాయ మంత్రులు
- మరో 36మంది సహాయ మంత్రులు
- ఎనిమిది మిత్రపక్షాలకు మంత్రిమండలిలో చోటు
- కార్యక్రమానికి హాజరైన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఆదివారం సాయంత్రం కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ సహా 72 మందితో 18వ లోక్‌సభకు మంత్రివర్గం కుదురుకుంది. రెండు తెలుగు రాష్ట్రాలనుంచి ఇద్దరు తెలుగువాళ్లు సహా 30మందికి కేబినెట్‌లో చోటుదక్కితే, ఐదుగురు స్వతంత్ర, 36మంది సహాయ మంత్రులుగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయించారు. రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో అట్టహాసంగా కొనసాగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విదేశీ ప్రత్యేక అహ్వానితులు, ఎన్డీయే అతిరథ మహారథులు 8వేలమంది హాజరయ్యారు. పాత కొత్తల మేలు కలయికగా రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, ఎస్ జైశంకర్, ఆంధ్రప్రదేశ్ నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డి తదితరులు మోదీతోపాటు ప్రమాణం స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. అంగరంగ వైభవంగా సాగిన మోదీ సర్కార్ 3.0 ప్రమాణ స్వీకార పూర్తి కథనం 2వ పేజీలో...

### పొలిటికల్ పెన్‌కౌంటర్



**18వ లోక్‌సభకు కేంద్ర మంత్రివర్గం ఆదివారం కొలువుదీరింది. 3వసారి ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈసారి బలమైన ప్రతిపక్షం వస్తుండటంతో.. మోదీ ముందు పెనుసవాళ్లు ముసురుతున్నాయి.**

న.మో నమః అన్నదిగా
థర్డ్ టైము భారతు!
మరోసారి ఛాన్స్‌కొట్టి
ప్రధానిగా విశ్వజీతు!!

పాలించుట సులువుగాదు
పెనుసవాళ్లే ముందర!
గద్దెనెక్కె దిగ్గజాన్ని
గొంతులోన గరగర!!

ముప్పుతిప్పలెట్టేందుకు
బలపడెనుగ విపక్షం!
ముచ్చెమటలు తప్పవుగా
ఎన్డీయేకు అనుక్షణం!!

భారీగా కుదురుకుంది
కేంద్ర మంత్రి-వర్గము!
విపక్షంతొ కొలువుదీర
లోకసభకు అందము!!

-మహాదేవ

## అక్షర సూరీడుకి

# అంతిమ వీడ్కోలు

- రామోజీ ఫిల్మ్‌సిటీ స్మృతివనంలో అంత్యక్రియలు
- స్వయంగా పాడె మోసిన తెదేపా అగ్రనేత చంద్రబాబు
- హాజరైన తెలుగు రాష్ట్రాల ప్రముఖులు, అభిమానులు

ఇక సెలవు! అంటూ అక్షర యోధుడు, రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు అనంతలోకాలకు వెళ్లిపోయారు. ఆదివారం తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఘనంగా ఆయన అంత్యక్రియలు ముగిశాయి. రామోజీ ఫిల్మ్ సిటీలోని విశాలమైన ప్రాంతంలో ఆయన నిర్మాణం చేయించుకున్న స్మృతి కట్టడం వద్దే అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. రామోజీరావు చితికి కుమారుడు, ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్ నిప్పంటించారు. రామోజీ గ్రూపు సంస్థల సిబ్బంది, అభిమానుల 'జోహార్ రామోజీరావు' నినాదాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి.

4



తెలంగాణలోని ఫిల్మ్‌సిటీలో ఆదివారం ఉదయం నిర్వహించిన రామోజీరావు అంతిమయాత్రలో స్వయంగా పాడె మోస్తున్న తెదేపా అగ్రనేత నారా చంద్రబాబు నాయుడు



## సాయం అతడే.. సమరం అతడే!!

సాయమడిగితే.. శత్రువుకైనా చేయందిస్తాడు. తన మనిషనుకుంటే.. ప్రమాదాలకైనా ఎదురెళ్తాడు. ఏ నియోజకవర్గ ప్రజలు అతనని వద్దనుకున్నారో.. వాళ్ల బాగోగులకే అంకితమయ్యాడు. రాష్ట్ర ప్రజలంతా తనవాళ్లేనని, పార్టీ కోసం నిలబడిన వాళ్లంతా తన కుటుంబమేనన్న ఆలోచన -ఆ యువనేతది. అందుకే ఎక్కడ ఓడాడో.. అక్కడే చారిత్రక విజయం సాధించాడు.

3

## ప్రధాని మోదీ..

# మూడవ మజిలీ ఎజెండా



- ఆర్థిక పగతి, సంక్షేమం, సుపరిపాలన
- దేశ భద్రత, పటిష్ట విదేశాంగ విధానం
- 2047 నాటికి వికసిత భారత్ ఎజెండా
- లోక్‌సభ ఎన్నికల్లో అంచనాలు తాకని బీజేపీ
- బలం పుంజుకున్న ప్రతిపక్షం
- ఉమ్మడి పౌరస్మృతిపై ఆచితూచి అడుగులు

5

## భారీగా కొలువుదీరిన

# మోదీ సర్కార్ 3.0



- రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నడ్డాసహా సీనియర్లకు చోటు
- కేబినెట్‌లోకి మాజీ సీఎంలు చౌహన్, మనోహర్‌లాల్, కుమారస్వామి
- తెలుగు రాష్ట్రాల నుంచి రామ్మోహన్ నాయుడు, కిషన్‌రెడ్డి
- సహాయ మంత్రులుగా పెమ్మసాని, శ్రీనివాసవర్మ, బండి సంజయ్
- 81మంది మంత్రులకు తావుండగా 72మంది ప్రమాణ స్వీకారం
- 30మంది కేబినెట్ మంత్రుల్లో తొమ్మిది కొత్త ముఖాలు
- ఐదుగురు స్వయంప్రతిపత్తి కల్గిన సహాయ మంత్రులు
- మరో 36మంది సహాయ మంత్రులు
- ఎనిమిది మిత్రపక్షాలకు మంత్రిమండలిలో చోటు
- కార్యక్రమానికి హాజరైన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్





న్యూఢిల్లీ: భారీ సంఖ్యలో మొత్తం 72 మంది మంత్రులతో నరేంద్ర దామోదర్ దాస్ మోదీ నాయకత్వంలో నూతన కేంద్ర ప్రభుత్వం కొలువు తీరంది. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ ముందున్న విశాల ప్రాంతంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము మోదీ, ఇతర మంత్రులచేత ఆదివారం నాడు ప్రమాణస్వీకారం చేయించారు. నియమాల ప్రకారం కేంద్ర మంత్రిమండలిలో 81 మంది సభ్యులు ఉండే అవకాశం ఉంది. ప్రధాని మోదీ మనోగతాన్ని ఆవిష్కరిస్తూ భారీ స్థాయిలో మొత్తం 72 మంది మంత్రులు కొలువుదీరడం గమనార్హం. దీంతో విస్తరణకు పెద్ద వెసులుబాటు కనిపించడం లేదు. ప్రజల తీర్పు మేరకు బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి వీలైనంత త్వరగా ఫలితాలను ప్రజలకు చూపాలి అన్న లక్ష్యంతో దాదాపు మొత్తం మంత్రిమండలి సభ్యులకు ఒకేరోజు ప్రధాని మోదీ బాధ్యతలు అప్పగించారని..ఇదొక విశేష పరిణామమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానించారు. శనివారంతో పదవీకాలం ముగిసిన మోదీ సర్కార్ 2.0లోని సీనియర్ మంత్రులదరికీ ప్రధాని మోదీ కొత్త కొలువులో స్థానం కల్పించారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్.డి.కుమారస్వామి కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మోదీ సర్కార్ 3.0లో కేబినెట్ మంత్రులుగా కొనసాగుతున్న సీనియర్లలో రాజనాథ్‌సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, డాక్టర్ ఎస్.జయశంకర్, జ్యోతిరాదిత్య సింధియా, ప్రహ్లాద్ జోషి, అరుణ్ వైష్ణవ్, జి.కిషన్‌రెడ్డి ఉన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షునిగా ఉన్న జెపి.నడ్డాను ప్రధాని మోదీ తన మంత్రిమండలిలోకి తీసుకున్నారు. కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన 30 మందిలో 25 మంది బిజెపికి చెందిన వారు. కాగా మొత్తం 24 రాష్ట్రాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభించింది. మొత్తం మంత్రుల్లో ఓబీసీ వర్గానికి చెందిన వారు 27 మంది, ఎస్‌సిలు 10 మంది, ఎస్టీలు ఆరుగురు, మైనార్టీలు ఐదుగురు ఉన్నారు.

ఎన్డీయే కూటమిలో ఐదు మిత్రపక్షాల నుండి ఒక్కొక్కరికి కేబినెట్ మంత్రులుగా మోదీ అవకాశం కల్పించారు. వీరు కింజరాపు రామ్మోహన్‌నాయుడు (తెదేపా), హెచ్‌డి కుమారస్వామి(జెడిఎస్) రాజీవ్‌రంజన్‌సింగ్(జెడీ యు), బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మాఝీ(హెచ్ఎం), చిరాగ్ పాశ్వాన్ (లోక్‌జనశక్తి పార్టీ).

స్వయంప్రతిపత్తిగలిన సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ఐదుగురిలో కూటమి భాగస్వామి జయంత్ చౌదరి(రాష్ట్రీయ లోక్‌దళ్)కు అవకాశం లభించింది. మిగిలిన నలుగురు బీజేపీకి చెందిన వారు.

### తెలుగు వెలుగులు

మోదీ సర్కార్ 3.0లో రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఐదుగురికి చోటు లభించింది. వీరిలో ఇద్దరు కేబినెట్ మంత్రులు, ముగ్గురు సహాయ మంత్రులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి మూడోసారి వరుసగా లోక్‌సభకు శ్రీకాకుళం స్థానం నుంచి తెదేపా తరుపున ఎన్నికైన కింజరాపు రామ్మోహన్ నాయుడు, తెలంగాణ నుండి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి వరుసగా రెండోసారి ఎన్నికైన బీజేపీ నేత జి.కిషన్‌రెడ్డి కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసారు.

సహాయ మంత్రులుగా గుంటూరు లోక్‌సభ సభ్యుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్(తెదేపా), నర్సాపురం నుండి ఎన్నికైన శ్రీనివాసవర్మ(బీజేపీ), తెలంగాణలో కరీంనగర్ నుంచి రెండోసారి ఎన్నికయిన బండి సంజయ్(బీజేపీ) మోదీ మంత్రిమండలిలో చేరారు.

గతంలో అటల్ బిహారి వాజ్‌పేయి నాయకత్వంలో ఏర్పడిన మూడు ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వాలు, నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏర్పడిన మొదటి రెండు సంకీర్ణ ప్రభుత్వాలతో సహా దాదాపు గత 20 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వంలో ఐదుగురు తెలుగు మంత్రులు మొదటిసారిగా బాధ్యతలు చేపట్టడం విశేషం.

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ఇతర ఇతర తెలుగు ప్రముఖులు ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు.

### విస్తరణలో జనసేనకు అవకాశం?

ఆదివారం జరిగిన మోదీ మంత్రిమండలి ప్రమాణస్వీకారంలో జనసేనకు చెందిన లోక్‌సభ సభ్యులెవరూ ప్రమాణస్వీకారం చేయలేదు. ఈ ఎన్నికల్లో జనసేన అభ్యర్థులుగా మచిలీపట్నం లోక్‌సభ స్థానం నుండి బాలశౌరి, కాకినాడ నుండి ఉదయ్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈనెల 12న చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుంది. ఇందులో జనసేనకు కనీసం నాలుగు స్థానాలు దక్కే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వంలో జనసేన తరుపు నుండి మంత్రులుగా చేరే నాయకుల పేర్లకు సంబంధించి స్పష్టత వచ్చిన తర్వాత జనసేన మోదీ ప్రభుత్వ విస్తరణ సమయంలో కేంద్ర ప్రభుత్వంలో చేరవచ్చని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. కాగా ప్రధాని మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి దేశ, విదేశాల నుండి ప్రముఖులు హాజరయ్యారు. ఏపీ నుండి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాన్ కూడా హాజరయ్యారు.

#### కొత్త కొలువులో
### కేబినెట్ మంత్రులు

1. నరేంద్ర మోదీ
2. రాజ్‌నాథ్‌సింగ్
3. అమిత్‌షా
4. నితిన్ గడ్కరీ
5. జేపీ నడ్డా
6. శివరాజ్ సింగ్ చౌహాన్
7. నిర్మలా సీతారామన్
8. ఎస్.జైశంకర్
9. మనోహర్‌లాల్ ఖట్టర్
10. హెచ్‌డీ కుమారస్వామి(జెడిఎస్)
11. పీయూష్ గోయల్
12. ధర్మేంద్ర ప్రదాన్
13. జితిన్ రామ్ మాంఝీ(హెచ్ఎం)
14. రాజీవ్ రంజన్ సింగ్(జెడియు)
15. శర్వానంద్ సోనోవాల్
16. వీరేంద్రకుమార్
17. కె రామ్మోహన్ నాయుడు(టీడీపీ)
18. ప్రహ్లాద్ జోషి
19. జుయల్ ఓరమ్
20. గిరిరాజ్ సింగ్
21. అశ్విని వైష్ణవ్
22. జ్యోతిరాదిత్య సింధియా
23. భూపేంద్ర యాదవ్
24. గజేంద్రసింగ్ షెకావత్
25. అన్నపూర్ణ దేవి
26. కిరణ్ రిజిజు
27. హర్‌దీప్‌సింగ్ పూరి
28. మన్సుక్ మాండవీయ
29. కిషన్‌రెడ్డి
30. చిరాగ్ పాశ్వాన్ (ఎల్‌జేఎస్‌పీ)
31. సీఆర్ పాటిల్

#### స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన
### సహాయ మంత్రులు

1. రావు ఇంద్రజిత్ సింగ్
2. జితేంద్రసింగ్
3. అర్జున్‌రామ్ మేఘవాల్
4. ప్రతాప్‌రావు గణపతిరావు జాదవ్
5. జయంత్ చౌదరి (ఆర్ఎల్‌డి)





చైతన్యరథం



# సాయం అతడే..
# సమరం అతడే!!

- అడిగిందే తడవుగా ఆపన్నులకు చేయూత
- కష్టంలోవున్న క్యాడర్‌ను కాపాడుకున్న యువనేత
- కూటమి గెలుపులో వన్ అండ్ ఓన్లీ.. లోకేష్

**సాయమడిగితే.. శత్రువుకైనా చేయందిస్తాడు. తన మనిషనుకుంటే.. ప్రమాదాలకైనా ముందుకు ఉరుకుతాడు. ఏ నియోజకవర్గ ప్రజలు అతనని వద్దనుకున్నారో.. ఆ నియోజకవర్గ ప్రజల బాగోగులకే అంకితమయ్యాడు. ఆపన్నులకు లేదనకుండా సాయమందిస్తాడు. కష్టంలోవున్న క్యాడర్‌ను కాదనకుండా కాపాడుకుంటాడు. గెలిచినా.. ఓడినా.. అతని నియోజవర్గానికే పరిమితం కాకుండా.. రాష్ట్ర ప్రజలంతా తనవాళ్లేనని, పార్టీ కోసం నిలబడిన వాళ్లంతా తన కుటుంబమేనన్న ఆలోచన -ఆ యువనేతది. అందుకే ఎక్కడ ఓడాడో.. అక్కడే చారిత్రక విజయం సాధించాడు. మంగళగిరిలో తెలుగుదేశం పార్టీకి ఓ రికార్డు సృష్టించాడు. రాష్ట్రాన్ని నాశనం చేసిన రాక్షస మూకమీద యుద్ధం ప్రకటించి.. యువగళంతో జనశక్తిని కూడదీసి.. సార్వత్రి ఎన్నికల్లో కూటమికి అప్రతిహత విజయానికి బాటలేశాడు. వైసీపీ రాక్షస మూకను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన వన్ అండ్ ఓన్లీ యంగ్ లీడర్ -లోకేష్. సింపుల్‌గా చెప్పాలంటే -ప్రజాపక్షానికి సాయం అతనే. ప్రత్యర్థులకు సమయం అతనే. యువనేత లోకేష్.. ఇప్పుడొక పెను తుపాన్!!**

అమరావతి (చైతన్య రథం): నిత్యం ప్రజల్లో ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నేనున్నానని భరోసా కల్పించడంలో యువనేత నారా లోకేష్ కృతకృత్యులయ్యారు. భరోసా అన్నది కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపించి నిసలైన ప్రజానాయకుడయ్యారు. ఐదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నా.. మంగళగిరి నియోజకవర్గంలో సొంత నిధులతో 29 సంక్షేమ కార్యక్రమాలను అమలుచేసి పేద ప్రజలకు వేదోడు వాదోడుగా నిలిచారు. యువగళం పాదయాత్రలో తమవద్దకు వచ్చి కష్టాలు చెప్పుకున్న ఆపన్నులకు తనవంతు సాయం అందించి అండగా నిలచారు. 3132 కి.మీ.ల సుదీర్ఘ పాదయాత్రలో ఎంతోమందికి పార్టీపరంగా, వ్యక్తిగతంగా సాయమందించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో మునిరాజప్ప అనే రజక మహిళ యువనేతను కలిసి తమ కష్టాలు చెప్పుకుంది. లోకేష్‌ను కలిసి సమస్యలు చెప్పిందన్న అక్కసుతో అక్కడి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి 2023 ఫిబ్రవరి 27న ఆమె టిఫిన్ బడ్డీని ధ్వంసంచేశారు. వైసీపీ కార్యాలయానికి వచ్చి తన కాళ్లు పట్టుకుని క్షమాపణ చెబితే వదిలేస్తామన్నారు. నేను చనిపోవడానికైనా సిద్ధమే.. క్షమాపణ చెప్పనని తెగేసి చెప్పిందామె. తర్వాత మునిరాజమ్మ లోకేష్ వద్దకు వచ్చి జరిగింది చెప్పడంతో ఆయన వెనువెంటనే స్పందించారు. మునిరాజమ్మ కొత్తషాపు ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సాయమందించారు. ధర్మవరంలో పాదయాత్ర సందర్భంగా చేనేతలతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో రాములమ్మ అనే మహిళ అప్పుల బాధతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, బిడ్డలకు చదువు చెప్పించలేకపోతున్నానని కన్నీరుమున్నీరైంది. దీంతో చలించిపోయిన లోకేష్.. ఆమె ఇద్దరి బిడ్డల చదువు బాధ్యత తాను తీసుకుంటానని చెప్పి, ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూలులో చేర్పించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా రైతులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో దళిత మహిళా రైతు రంగమ్మ తన బాధను వెళ్లబోసుకుంది. 12 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేయడం వల్ల రూ.30 లక్షల అప్పుకావడంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పింది. అక్కడికక్కడే రంగమ్మకు రూ.లక్ష సాయాన్ని ప్రకటించారు లోకేష్. పాదయాత్ర ఆ నియోజకవర్గం దాటక ముందే 2023 ఏప్రిల్ 30న ఎమ్మిగనూరు సభలో సంబంధిత చెక్కును రంగమ్మకు అందించారు. దారిపొడవునా ఇలా ఎంతోమందికి యువనేత సాయమందించారు. కష్టాల్లో ఉన్న ప్రజలను వెనువెంటనే చేయూతనందించే ఈ గుణం, సమస్యలపై వెనువెంటనే స్పందించే తీరు లోకేష్ మాటపై ప్రజల్లో అపారమైన నమ్మకాన్ని కలిగించింది.

కుటుంబసభ్యుడి మాదిరిగా కష్టాల ఏకరువు

పాదయాత్ర సమయంలో కుటుంబసభ్యుడి మాదిరిగా వివిధవర్గాల ప్రజలు యువనేతను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. కమ్యూనిటీ సమస్యలతోపాటు వ్యక్తిగత సమస్యలను సైతం యువనేతకు చెప్పి స్వాంతన పొందారు. పలమనేరులో వైసీపీ నేత సునీల్ వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న చదువుల తల్లి మిస్బా తల్లిదండ్రులు నసీమా, వజీర్ అహ్మద్ పుంగనూరు నియోజకవర్గం కల్లూరువద్ద పాదయాత్ర సమయంలో లోకేష్‌ను కలిశారు. లోకేష్‌ను కలిస్తే ఊళ్లో ఉండనివ్వం, ఇతర రాష్ట్రాలకు వెళ్లి బతకాల్సిందేనని వైసీపీ నేతలు బెదిరించినా లెక్క చేయకుండా మిస్బా తల్లిదండ్రులు యువనేత వద్దకు వచ్చారు. వైసీపీ నాయకుడు సునీల్ కుమార్తెకి సెకండ్ ర్యాంక్ వచ్చిందని ప్రిన్సిపల్‌పై ఒత్తిడి చేసి తమ కుమార్తెకు టీసీ ఇచ్చి బయటకి పంపేశారని, ఆ అవమానాన్ని భరించలేక మా కుమార్తె ఆత్మహత్య చేసుకుందని కన్నీరు మున్నీరయ్యారు. మిస్బాకు సంబంధించిన మార్కుల లిస్టులు, డ్రాయింగ్ పుస్తకాలు, వివిధ పోటీల్లో మిస్బా సాధించిన విజయాలకు సంబంధించిన సర్టిఫికెట్లు తెచ్చి చూపించినపుడు యువనేత చలించిపోయారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక మీకు న్యాయం చేస్తామని, మిస్బాను పొట్టనబెట్టుకున్న వారిని కటకటాల వెనక్కి పంపుతామని ధైర్యం చెప్పారు. 2023 జూలై 7న ఒంగోలులో జరిగిన జయహో బీసీ సదస్సులో వైసీపీ ముష్కరుల చేతిలో బలైన రేపల్లెకు చెందిన అమర్నాథ్ గౌడ్ అక్క హేమశ్రీ, లోకేష్‌ను కలిసి తమ ఆవేదనను చెప్పుకుంది. నన్ను ఏడాదిన్నరగా వైసీపీ కీచకులు ఏడిపిస్తుంటే, నా తమ్ముడు ప్రశ్నించినందుకు పెట్రోల్ పోసి తగులబెట్టేశారు. తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడని సృష్టించారు. కేసు కూడా సరిగా నమోదు చేయలేదు, బీసీలు ఏమీ చేయలేరు, ప్రశ్నించలేరనే ఈవిధమైన అకృత్యాలకు పాల్పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంలో లోకేష్ స్పందిస్తూ... ఇలాంటి మరో చెల్లికి, అక్కకి జరగకుండా చూసే బాధ్యతను ఈ లోకేష్ తీసుకుంటాడు. అధికారంలోకి వచ్చాక అమర్నాథ్ గౌడ్ హత్య వెనుక ఎంతటి వాడు ఉన్నాసరే తీసుకొచ్చి జైల్లో పడేస్తాం. అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో బీసీ రక్షణ చట్టం తెస్తామని ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఈ హామీని మ్యానిఫెస్టోలో పొందుపర్చారు. ఆయావర్గాలకు యువనేత కల్పించిన భరోసాతోనే ఎన్నికల్లో ఓట్లవర్షం కురిపించింది.

యువనేత బలం, బలగం టీడీపీ కార్యకర్తలే

సుదీర్ఘ పాదయాత్ర చేసినా, రాష్ట్రవ్యాప్తంగా శంఖారావం వంటి కార్యక్రమాలతో సుడిగాలి పర్యటన చేసినా తనకోసం ప్రాణాలిచ్చే కార్యకర్తలే యువనేత లోకేష్ బలం, బలగం. యువగళం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి స్వచ్ఛందంగా వచ్చిన 400మంది వాలంటీర్లు క్రమశిక్షణగల సైనికుల్లా పనిచేశారు. యువగళం పాదయాత్రను ఏవిధంగానైనా భగ్నం చేయాలని వైసీపీ తొత్తులుగా మారిన పోలీసులు ఒకవైపు, వైసీపీ ముష్కరమూకలు మరోవైపు ఎంత రెచ్చగొట్టినా వాలంటీర్లు ఎంతో ఓర్పుతో సేవలందించారు. అదేవిధంగా తమను నమ్ముకున్న కార్యకర్తలకు యువనేత లోకేష్ కంటికిరెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ఒకవైపు పాదయాత్ర చేస్తూనే క్షేత్రస్థాయిలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యాడర్‌కు యువనేత అండగా నిలిచారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం అనంతసాగరం మండలం మినగల్లు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త చిట్టిబోయిన పెద్ద వెంగయ్యని వైసీపీ నేతలు అత్యంత దారుణంగా హతమార్చారు. యువగళం పాదయాత్రలో భాగంగా అనంతసాగరంలో నిర్వహించిన బహిరంగసభలో మృతుడు భార్య ధనలక్ష్మమ్మకి 16-6-2023న రూ.5లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. గూడూరు నియోజకవర్గం చిట్టమూరులో వెంకటరమణ అనే కార్యకర్త కుటుంబసభ్యులు యువనేత నారా లోకేష్‌ను కలిశారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మృతుడి భార్య నాగమణి ఆవేదన వ్యక్తం చేయడంతో కార్యకర్తల సంక్షేమ నిధినుంచి సాయం అందించారు. ఇలా దేశంలో మరెక్కడా లేనివిధంగా కార్యకర్తల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఐదేళ్లలో రూ.130 కోట్ల సాయం అందించారు. లోకేష్ ఇచ్చిన ఈ భరోసాతోనే ఎన్నికల కురుక్షేత్రంలో అరాచక ప్రభుత్వానికి ఎదురొడ్డి పోరాడి పార్టీని విజయతీరాలకు చేర్చారు.




ఫిల్మ్‌సిటీలోని స్మృతివనం వద్ద రామోజీ పాడె మోస్తున్న తెదేపా అగ్రనేత చంద్రబాబు నాయుడు. అంత్యక్రియలలో పాల్గొన్న చంద్రబాబు

# అక్షర సూరీడుకి అంతిమ వీడ్కోలు

- రామోజీ ఫిల్మ్‌సిటీ స్మృతివనంలో అంత్యక్రియలు
- స్వయంగా పాడె మోసిన తెదేపా అగ్రనేత చంద్రబాబు
- హాజరైన తెలుగు రాష్ట్రాల ప్రముఖులు, అభిమానులు

అమరావతి (చైతన్య రథం): మీడియా మొఘల్, రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వ అధికార లాంఛనాలతో విషణ్ణ వదనాల మధ్య ఘనంగా ముగిశాయి. రామోజీ ఫిల్మ్ సిటీలోని స్మృతివనంలో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో అక్షర యోధుడి అంతిమయాత్ర ప్రారంభమైంది. కడపటి చూపుతో కన్నీరు మున్నీరైన కుటుంబీకులు, మనుమడు సంజయ్ నివాళి అర్పించిన అనంతరం పెద్దఎత్తున అంతిమయాత్ర మొదలైంది. రామోజీకి జోహార్లు పలుకుతూ, రామోజీ గ్రూప్ సంస్థల ప్రధాన కార్యాలయాల మీదుగా అంతిమ యాత్ర సాగింది. స్మృతివనం వరకూ సాగిన అంతిమయాత్రలో తెలుగు రాష్ట్రాల ప్రముఖులు, రామోజీ గ్రూప్ సంస్థల సిబ్బంది, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున ముగ్గురు ఐఏఎస్ అధికారులు రజత్ భార్గవ, సాయిప్రసాద్, ఆర్పీ సిసోడియా హాజరై లాంఛన ప్రక్రియను పూర్తి చేశారు. అంత్యక్రియలకు హాజరైన తెలుగుదేశం అగ్రనేత చంద్రబాబు నాయుడు స్వయంగా రామోజీరావు పార్థివ దేహాన్ని ఉంచిన కాడె మోశారు. రామోజీ పార్థివ దేహం స్మృతివనం వద్దకు చేరగానే గాలిలోకి తుపాకులు పేల్చి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం రామోజీరావు కుమారుడు, ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్ తండ్రి భౌతిక కాయానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అశ్రునయనాలతో కుటుంబసభ్యులు కడపటి వీడ్కోలు పలికారు. జీవన మార్గదర్శికి కడసారి వీడ్కోలు పలికేందుకు వివిధ పార్టీలకు చెందిన నేతలు, సినీ ప్రముఖులు, భాషాభిమానులు, రామోజీ గ్రూపు సంస్థల ఉద్యోగులు, ప్రజలు తరలివచ్చారు. రామోజీరావు అంతిమ సంస్కారాల్లో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, కిషన్ రెడ్డి, బండి సంజయ్, సుజనాచౌదరి, రఘురామకృష్ణరాజు, తెలంగాణ మంత్రి తుమ్మల, చింతమనేని ప్రభాకర్, అరిమిల్లి రాధాకృష్ణ, పట్టాభి, తుమ్మల, జూపల్లి, సీతక్క ఎర్రబెల్లి, పోచారం, నామా నాగేశ్వరరావు, అరికపూడి గాంధీ, నలమోతు భాస్కర్ రావు, వేం నరేందర్ రెడ్డి, వెనిగండ్ల రాము, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, వి.హనుమంతరావు, కేఆర్ సురేష్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత సురేష్ బాబు తెలుగు రాష్ట్రాల ప్రముఖులు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు. చెరుకూరి రామోజీరావు (88) శనివారం ఉదయం తెల్లవారుజామున అస్తమించడం తెలిసిందే. గుండె సంబంధిత సమస్యతో ఇబ్బందిపడిన ఆయనను హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్చడంతో చికిత్స పొందుతూ తెల్లవారుజామున 4.50కు తుదిశ్వాస విడిచారు.

**రామోజీ ప్రస్థానం:**

రామోజీరావు కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 1936 నవంబరు 16న జన్మించారు. గుడివాడలో విద్యాభ్యాసం కొనసాగింది. చిరు ఉద్యోగిగా తన ప్రస్థానం మొదలుపెట్టిన ఆయన, చిన్న అడ్వర్టైజింగ్ ఏజెన్సీలో ఆర్టిస్టుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. కొంతకాలం ప్రకటనల రంగంలో పని చేసి 1962లో హైదరాబాద్ మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ స్థాపించారు. మధ్య తరగతి కుటుంబాల్లో పొదుపు అవశ్యకతకు మార్గదర్శి ఎంతో బలం చేకూర్చింది. 1969లో అన్నదాత పత్రిక ప్రారంభించి రైతు సమస్యలు, సాగురంగం ఇబ్బందులు, మెళకువలను ముద్రించేవారు. 1974 ఆగస్టు 10న విశాఖపట్నంలో స్థాపించిన ఈనాడు' పత్రిక సంచలనాలను సృష్టించింది. ప్రాంతీయ దినపత్రికల చరిత్రలో 'ఈనాడు' సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. క్రమంగా హైదరాబాద్ ఎడిషన్‌తో పాటు జిల్లాల ఎడిషన్‌లూ ప్రచురించి సామాజిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో సక్సెస్ అయింది. సినీ ప్రేమికుల కోసం రామోజీరావు 'సితార' పత్రిక ప్రారంభించారు. భాషా ప్రేమికుల కోసం 'చతుర', 'విపుల' మాస పత్రికలూ తీసుకొచ్చారు. 'ప్రియా ఫుడ్స్' పేరిట పచ్చళ్ల వ్యాపారాన్ని విజయవంతం చేశారు. 1983లో 'ఉషాకిరణ్ మూవీస్' సంస్థ ఏర్పాటు చేసి, ఈ బ్యానర్‌లో అనేక చిత్రాలను నిర్మించారు.

ప్రపంచలోనే అతి పెద్ద చిత్రనగరి 'రామోజీ ఫిల్మ్ సిటీ'ని రంగారెడ్డి జిల్లా పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలో విస్తరించారు. 1990లో రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా 'ఈనాడు జర్నలిజం స్కూలు' ప్రారంభించారు. 'ఈటీవీ' ఆధ్వర్యంలో పలు ప్రాంతీయ ఛానళ్లను ప్రారంభించి, 2002లో 'రమాదేవి పబ్లిక్ స్కూల్'ను ఏర్పాటు చేశారు. పేపర్, టీవీ మీడియాలోనే కాకుండా -డిజిటల్ మార్కెట్‌లోకి విస్తరించేందుకు ఈటీవీ భారత్ పేరిట మొబైల్ న్యూస్ యాప్‌ను తీసుకొచ్చారు. అనేక రంగాల్లో సేవలందించిన రామోజీ రావును పలు పురస్కారాలు వరించాయి. మీడియా రంగంలో ఇచ్చే అతి ప్రతిష్టాత్మకమైన బిడి గోయెంకా అవార్డు రామోజీరావుకు దక్కింది. 2016లో కేంద్రం ప్రభుత్వం నుంచి పద్మవిభూషణ్ అందుకున్నారు.

## బాధాతప్త హృదయంతో...

తెలుగు వెలుగు, అక్షర యోధుని అంతిమ సంస్కార కార్యక్రమంలో పాల్గొన్నాను. తెలుగువారి ఆత్మబంధువు రామోజీకి కడసారి వీడ్కోలు పలికాను. హృదయం బాధతో నిండిపోయింది. ఈనాడు ఆయన మన మధ్య లేకపోయినా... ఆ మహనీయుడు ఇచ్చిన స్ఫూర్తి మార్గదర్శిగా మనల్ని ముందుకు నడిపిస్తుంది. ఉషాకిరణాల్లాంటి ఆయన కీర్తి అనునిత్యం అజరామరమై వెలుగుతుంది.

-నారా చంద్రబాబు నాయుడు

## ఆయనకు ఆయనే సాటి..

అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రామోజీరావు శనివారం కన్నుమూయడంతో ఆయనకు నివాళి అర్పిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వ్యాసం రాశారు. తెలుగు పత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఆయన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పోస్ట్ చేశారు. 'గడిచిన కొద్దివారాలు రాజకీయ నేతలకు, మీడియాకు తీరికలేకుండా గడిచాయి. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ఇటీవలే ముగిసింది. మూడోసారి ప్రభుత్వ ఏర్పాటు సన్నాహాల్లో మేం నిమగ్నమై ఉన్నవేళ నాకు ఒక విషాద వార్త అందింది. రామోజీరావు ఇక లేరని తెలిసింది. మా మధ్య ఉన్న సాన్నిహిత్యం దృష్ట్యా వ్యక్తిగతంగా ఇది నాకు తీవ్ర నష్టం. రామోజీరావు గురించి ఆలోచించగానే నా మనసులో ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి మెదిలారు. ఆయనకు ఆయనే సాటి. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయన భిన్న రంగాల్లో అద్భుతంగా రాణించారు. సినిమాలు, వినోదం, మీడియా, వ్యవసాయం, విద్య, పాలనపై తనదైన ముద్ర వేశారు. అయినా జీవితపర్యంతం ఆయనలో వినమ్రత సడలలేదు. అలాగే మూలాలను ఎన్నడూ విస్మరించలేదు. ఈ గొప్ప లక్షణాలే ఆయనను అనేక మందికి ఆత్మీయుడిని చేశాయి' అని వ్యాసంలో పేర్కొన్నారు.

-ప్రధాని నరేంద్ర మోదీ



రామోజీ పార్థివ దేహంపై పుష్పాలుంచుతున్న చంద్రబాబు




రామోజీ పార్థివ దేహానికి అంత్యక్రియలు





# ప్రధాని మోదీ మూడవ మజిలీ ఎజెండా

- ఆర్థిక ప్రగతి, సంక్షేమం, సుపరిపాలన
- దేశ భద్రత, పటిష్ఠ విదేశాంగ విధానం
- 2047 నాటికి వికసిత భారత్ ఎజెండా
- లోక్‌సభ ఎన్నికల్లో అంచనాలు తాకని బీజేపీ
- బలం పుంజుకున్న ప్రతిపక్షం
- ఉమ్మడి పౌరస్మృతిపై ఆచితూచి అడుగులు

నరేంద్ర దామోదర్ దాస్ మోదీ భారత ప్రధానిగా మూడోసారి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. దేశ రాజకీయ యవనికలో ఇదొక చారిత్రక ఘట్టం. స్వాతంత్ర్యానంతరం 30 ఏళ్లు దేశాన్ని నడిపించడంలో కాంగ్రెస్ హవా నిరాటంకంగా సాగింది. 1977 నుంచి కాంగ్రెస్‌కు రాజకీయ సవాళ్లు, ప్రతికూలతలు ఎదురైనాయి. జనతాపార్టీ చేతిలో 1977 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మొదటిసారి ఓటమిని చవిచూసింది. 1989లో కేంద్రంలో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ 15 ఏళ్ల విరామం తర్వాత 2004లో అధికారంలోకి వచ్చి పదేళ్లు సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపింది.

ఈమధ్య కాలంలో అడపాదడపా పలు సంకీర్ణ ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వాలను ఏర్పాటు చేసాయి. నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫంట్లు మూడుసార్లు, బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రాటిక్ ఎలయన్స్ (ఎన్డీఏ) 1996, 1998, 1999లలో సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటుచేశాయి. వెరసి.. 1984లో ఏర్పడిన రాజీవ్‌గాంధీ ప్రభుత్వం తర్వాత 30 ఏళ్లకు నరేంద్రమోదీ నాయకత్వంలో లోక్‌సభలో స్పష్టమైన మెజరిటీతో కేంద్ర ప్రభుత్వం ఏర్పడి గత పదేళ్లుగా అధికారంలో ఉండి మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రధాని వాజ్‌పేయి నాయకత్వంలో బీజేపీ ఆరేళ్ళు కేంద్రంలో పాలనచేసి మితవాద పాలనకు శ్రీకారం చుట్టడం జరిగింది. ప్రధానిమోదీ ఈ ఐదేళ్ల పాలన పూర్తి చేసుకుంటే బీజేపీ నాయకత్వంలో 2029 వరకు 15 ఏళ్లు నిరాఘాటంగా మితవాద పాలన కొనసాగినట్టవుతుంది. దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలో ఇదొక ప్రధాన రాజకీయ అధ్యాయంగా పరిశీలకులు అభివర్ణిస్తారు. వాజ్‌పేయి నాయకత్వంలో దేశరాజకీయాల్లో వచ్చిన మార్పును సుస్థిరం చేసిన నాయకుడిగా మోదీ పేరుగాంచారు.

### మోదీ యుగం

దేశ రాజకీయాల్లో నరేంద్రమోదీ తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని ఇప్పటికే కల్పించుకున్నారు. 12 ఏళ్లపాటు సొంత రాష్ట్రం గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండి అక్కడ సాధించిన విజయాల నేపథ్యంలో 2014లో దేశ ప్రధాని బాధ్యతలు చేపట్టినప్పటి నుండి దినదిన ప్రవర్థమానమవుతూ దేశ, విదేశాల్లో విశేష ఖ్యాతి పొందారు. కాలక్రమంలో దేశ ప్రధాని పదవికి మోదీకి దీటైన నాయకులు ఎవరూ లేరన్న భావన దేశవ్యాప్తంగా ప్రజల్లో ఏర్పడిరది. పలుసార్లు పలు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికల్లోకంటే బీజేపీ లోక్‌సభ అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు పడడం దీన్ని నిర్ధారించింది. నరేంద్రమోదీ రాజకీయ ప్రయాణం, గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన ఆలోచనలు, మాటలు, చేతలు, సాధించిన విజయాల నేపథ్యంలో 21వ శతాబ్ధపు ప్రథమార్థం మోదీకే చెందుతుందని పరిశీలకుల అభిప్రాయం.

### మూడవ మజిలీలో మోదీ ఏమి చేయనున్నారు..?

గుజరాత్ వాణిజ్యపరంగా, పారిశ్రామికంగా దేశంలో బాగా ముందంజ వేసిన రాష్ట్రం. 12 ఏళ్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఈ రెండు రంగాల్లో రాష్ట్రాన్ని మోదీ ఇంకా పరుగులు తీయించారు. వ్యాపార సౌలభ్యతను బాగా పెంపొందించడంతో పాటు పలు పెట్టుబడుల సదస్సులతో భారీఎత్తున పరిశ్రమల స్థాపనకు ఊతమిచ్చారు. ఆయన హయంలో గుజరాత్ ఎన్నో



**2047నాటికి వికసిత భారత్**

2047లో భారతదేశం వందేళ్ల స్వాతంత్ర్యాన్ని జరుపుకోనుంది. అప్పటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడానికి సమష్టిగా కృషి చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ దిశగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కూడా ప్రధాని మోదీ ఉత్తేజ పరుస్తున్నారు. ఎంతో విశేషంతో కూడిన ఈ లక్ష్యసాధన దేశానికి, ప్రజలకు ఎంతో మేలుచేయనుంది. ప్రధాని మోదీ తన శక్తి యుక్తులన్నింటిని ఈ దిశగా కేంద్రీకరించనున్నారు. ఈ అంశం ప్రధాని మోదీ అజెండాలో ముఖ్యమైనది.

రెట్లు అభివృద్ధి చెందిందని దేశ, విదేశాల్లో భారీగా ప్రచారమైంది. దేశం కూడా ఆ విధంగా ముందుకు సాగాలంటే మోదీ ప్రధాని కావాలన్న భావన ప్రజల్లో నెలకొని 2014 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ విజయానికి బాగా తోడ్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ మొదటి టర్మ్‌లో అభివృద్ధి, పెట్టుబడులు, వాణిజ్య సౌలభ్యం, మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంస్కరణలపై దృష్టి కేంద్రీకరించి మాట్లాదారు. కొంతకాలం తర్వాత ప్రతిపక్షాల విమర్శలతో ప్రధాని మోదీ వైఖరిలో కొంత మార్పు వచ్చింది. దేశవ్యాప్తంగా పలు సంక్షేమ కార్యక్రమాల అమలుకు పూనుకున్నారు. సమ్మిళిత అభివృద్ధి అవశ్యకత, పేదరిక నిర్మూలనపై దృష్టి పెట్టారు. సబ్ కా సాత్ -సబ్ కా వికాస్ అనే నినాదాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లారు. రెండో టర్మ్‌లో సంక్షేమ కార్యక్రమాల జోరు పెంచారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధివంటి పలు కార్యక్రమాలను ప్రవేశపెట్టి దేశవ్యాప్తంగా పటిష్టంగా అమలు చేసేలా చూశారు. ఈ ప్రయత్నాలతో 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లు గెలుచుకోగలిగింది. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పట్ల సంతులనంతో మోదీ ప్రభుత్వం కొనసాగింది.

ప్రధాని అయినప్పటి నుంచి దేశ రక్షణ, ప్రపంచంలో దేశ గౌరవాన్ని పెంచడంపై దృష్టి పెట్టి పలు విజయాలు సాధించారు. సరిహద్దుల్లో పాకిస్థాన్, చైనా అగడాలకు కళ్లెం వేయగలిగారు. వీటితో ప్రధాని మోదీపట్ల ప్రజాభిమానం పలురెట్లు పెరిగింది. దేశ ప్రధాని పదవికి మరో ప్రత్యామ్నాయం లేదన్న భావన ఇంకా బలపడింది. మోదీ ప్రధాని కాకముందు ప్రపంచంలో 11వ ఆర్థిక శక్తిగావున్న భారత్ మోదీ పదేళ్ల పాలన ముగింపు సమయంలో ఐదవ స్థానానికి ఎగబాకింది.

### భావి ఎజెండా

2024 ఎన్నికల్లో గెలుపొందిన ఎన్డీఏ కూటమి నేతల సమావేశంలో మాట్లాడిన ప్రధాని మోదీ రానున్న కాలానికి తమ లక్ష్యాలను గురించి మాట్లాదారు. అభివృద్ధి, సుపరిపాలన, ప్రభుత్వాల జోక్యం అతి తక్కువగా ఉండే పౌరుల స్వేచ్ఛాయుత జీవనం పట్ల దృష్టి సారిస్తామని మోదీ తెలిపారు. ఎన్నికలకు ముందు పలుసార్లు తమ మూడవ టరమ్ పూర్తయ్యేసరికి దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో మూడవ స్థానానికి తీసుకెళతామని స్పష్టం చేశారు. దీన్నిబట్టి దేశ ఆర్థికాభివృద్ధిని పరుగులు పెట్టించడం తమ లక్ష్యంగా కొనసాగుతుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి వర్గాల జీవన ప్రమాణాలను పెంచటానికి చిత్తశుద్ధిగా కృషి చేస్తామని స్పష్టంచేసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అవసరాల మేరకు తగు పాళ్లలో కొనసాగిస్తామని మోదీ తమ అంతరంగాన్ని వెల్లడించారు.

### 2024 ఎన్నికల ఫలితాల ప్రభావం?

ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆశించిన మేరకు ఫలితాలను సాధించలేకపోయింది. 2014 ఎన్నికల్లో లోక్‌సభలో స్పష్టమైన మెజారిటీకి అవసరమైన 272 సీట్లకంటే కొంచెం ఎక్కువ స్థానాలు గెలుచుకున్న బీజేపీ 2019 ఎన్నికల్లో 303 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో బిజేపీ 370 స్థానాలు, ఎన్డీఏ కూటమి 400 స్థానాలను గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే బిజేపీ 240, కూటమి 293 స్థానాలను గెలుచుకొంది. ఈ ఫలితాలు బిజేపీ అగ్ర నాయకత్వాన్ని ఆశ్చర్యానికి గురిచేశాయి.

ఈ నేపథ్యంలో రాబోయే కాలానికి ప్రధాని మోదీ ప్రాధాన్యతలు ఎలా ఉంటాయి? ఇప్పటివరకు అనుసరించిన ఎజెండాలో ఏమైనా మార్పులు ఉంటాయా? అన్న అంశంపై చర్చ జరుగుతోంది. ఎన్డీఏ కూటమి సంకీర్ణ ప్రభుత్వానికి లోక్‌సభలో స్పష్టమైన మెజారిటీ మార్కు కంటే 21 స్థానాలు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వం సజావుగా నడవడానికి కూటమి భాగస్వాములపై ఆధారపడవల్సిన పరిస్థితి ప్రధాని మోదీ ఎదుర్కొంటున్నారు. ఊహించని విధంగా లోక్‌సభలో ప్రతిపక్షం పుంజుకొని తన బలాన్ని 233కి పెంచుకుంది. ఈ పరిస్థితుల్లో ప్రధాని మోదీ కొంతమేరకు ఆచితూచి నడవాల్సి వుంటుందని, ఉమ్మడి పౌరస్మృతి వంటి అంశాలను కొంతమేరకు పెండింగ్‌లో పెట్టవచ్చని పరిశీలకుల అభిప్రాయం.

ఈ ఎన్నికల్లో బీజేపీ అంచనాల మేరకు ఫలితాలు సాధించలేకపోవడానికి కారణాలను వీలైనంత త్వరలో బీజేపీ అగ్రనాయకత్వం పూర్తిస్థాయిలో సమీక్షించి పరిపాలన, విధానపరమైన విషయాలపై అవసరాల మేరకు తగు మార్పులు చేసే అవకాశం వుందని పరిశీలకుల అభిప్రాయం. అత్యంత ప్రధాన రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో గతంలోకంటే 33 లోక్‌సభ సీట్లు కోల్పోవడంతో ఈ ఎన్నికల్లో బీజేపి కొంతమేరకు నష్టపోయిందని.. దీనికి స్థానిక రాజకీయ పరిస్థితులు, మారిన సామాజిక సమీకరణాలు ప్రధాన కారణమై ఉండొచ్చని పరిశీలకుల విశ్లేషణ. అయోధ్యతో కూడిన ఫైజాబాద్ లోక్‌సభ స్థానంలో బిజేపి ఓడిపోవడంతో రామమందిరం వంటి అంశాల ప్రభావంపట్ల భాజపా నాయకత్వం సమీక్షించుకోవచ్చునని పరిశీలకుల భావన.

ఎన్నికలను ఇతర రాజకీయ పార్టీలకంటే చాలా సీరియస్‌గా తీసుకునే బీజేపీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల ప్రజలు తమ తీర్పు ద్వారా ఇచ్చిన సందేశాలను సమగ్రంగా విశ్లేషించి తగు మేరకు రాజకీయ, పాలనా పరమైన సవరణలు చేపట్ట వచ్చునని.. అయితే ప్రధాని మోదీ, భాజపా ప్రాధాన్యతల్లో భారీ మార్పులుండే అవకాశం లేదని పరిశీలకుల అభిప్రాయం. ఆర్థికాభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన, దేశ భద్రత, పటిష్టమైన విదేశాంగ విధానం అవసరమైన మేరకు తగు సవరణలతో ప్రధాని మోదీ ప్రాధాన్యతలుగా కొనసాగవచ్చునని.. ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో.. ప్రజల మనసులను గెలుచుకోవడానికి ఈ ప్రాధాన్యతల పటిష్టమైన అమలుపట్ల ప్రధాని మోదీ ఇంకా ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తారని.. దీనివలన దేశానికి మంచి జరుగుతుందని విశ్లేషకుల అభిప్రాయం.

## ఆగిన అమరావతి పరిస్థితిపై ఆరా

**రాజధాని ప్రాంతంలో సీఎస్ పర్యటన - ఆగిన నిర్మాణ పనుల పరిశీలన**



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రిగా తెదేపా అగ్రనేత చంద్రబాబు ప్రమాణ స్వీకార ముహూర్తం దగ్గర పడటంతో -రాష్ట్ర రాజధాని అమరావతి స్థితిగతులపై అధికారులు పరుగులు మొదలుపెట్టారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు త్వరలోనే అమరావతి ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించే అవకాశం లేకపోలేదు. గత ప్రభుత్వం అమరావతిని నిర్లక్ష్యం చేయడంతో, ఆ ప్రాంతమంతా పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లతో అధ్వాన్నంగా తయారైంది. నిర్మాణంలోవున్న భవనాల పరిస్థితీ అంతంత మాత్రంగా తయారైంది. ఈనేపథ్యంలో చంద్రబాబు ఆ ప్రాంతాన్ని పరిశీలించే సమయానికి పరిసరాలమైనా శుభ్రం చేయడానికి అధికార యంత్రాంగం పనులు మొదలుపెట్టింది. అందులో భాగంగా రాజధానిలో ఆగిన నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని, సీఆర్డీయే కార్యాలయాన్ని, ప్రజాప్రతినిధుల నివాసాలు, అఖిలభారత సర్వీసు అధికారుల క్వార్టర్స్, హైకోర్టు, నాలుగో తరగతి సిబ్బంది నివాసాలను పరిశీలించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసేలోపు రాజధానిలో పరిశుభ్రత పనులు పూర్తి చేస్తామన్నారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు 94 జేసీబీలతో 34 ప్రాంతాల్లో పనులు కొనసాగిస్తున్నామన్నారు. గత ఐదేళ్లుగా ఎలాంటి పనులు చేయని భవనాల నాణ్యతపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఏపీ బెవరేజెస్, మైనింగ్, సీఐడీ కార్యాలయాలను జప్తు చేసి వాటిలో కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎస్ చెప్పారు. సీఎస్‌తో పాటు సీఆర్డీయే కమిషనర్ వివేక్ యాదవ్ తదితరులు రాజధాని ప్రాంతంలో పర్యటించారు.

# అత్యంత పిన్న వయస్కుడైన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు అయిన తన తండ్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఆశయ సాధన కోసం రాజకీయాల్లోకి వచ్చిన రామ్మోహన్‌నాయుడు అనతి కాలంలోనే తనదైన ముద్ర వేశారు. డిసెంబర్ 18, 1987లో జన్మించిన రామ్మోహన్‌నాయుడు ప్రస్తుత మంత్రివర్గంలో అత్యంత పిన్న వయస్కుడు. ఆర్‌కే పురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో స్కూల్ విద్యను పూర్తి చేసుకున్న రామ్మోహన్‌నాయుడు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీని పూర్డ్యూ యూనివర్సిటీ నుంచి చేశారు. ఆ తర్వాత లాంగ్ ఐస్‌ల్యాండ్‌లో ఎంబీఏ చేశారు.

### రాజకీయ రంగ ప్రవేశం

సింగపూర్‌లో కేరీర్‌లో కొనసాగుతున్న రామ్మోహన్ నాయుడు.. తన తండ్రి యర్రన్నాయుడు కారు ప్రమాదంలో 2012లో ఆకస్మాత్తుగా మరణించడంతో ఆయన ఆశయాలను సాధించేందుకు, ఆయన వారసత్వాన్ని కొనసాగించేందుకు రాజకీయాల్లోకి ప్రవేశించారు. 26 ఏళ్ల వయస్సులో 2014లో శ్రీకాకుళం ఎంపీ సీటు నుండి పోటీ చేసి గెలుపొందారు. 16వ లోకసభలో రెండో అతి పిన్న వయస్కుడైన ఎంపీగా రికార్డు సృష్టించారు. ఆ తర్వాత 2019లోనూ, 2024లో వరుసగా మూడసార్లు ఎంపీగా గెలుపొందారు.

### చంద్రబాబుతో సాన్నిహిత్యం

టీడీపీ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో రామ్మోహన్‌నాయుడుకు చాలా దగ్గరిక సాన్నిహిత్యం ఉంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్న రామ్మోమన్‌నాయుడు చంద్రబాబు అడుగుజాడల్లో నడిచారు. ఆయన తండ్రి యర్రన్నాయుడు లాగానే రామ్మోహన్‌నాయుడు కూడా చంద్రబాబు పూర్తి విశ్వాసపాత్రుడిగా ఉన్నారు. పార్టీకి అవసరమైన కీలక సమయాల్లో ఢిల్లీలో క్రియాశీలంగా పనిచేశాడు. ముఖ్యంగా చంద్రబాబును అరెస్ట్ చేసినప్పుడు ఢిల్లీకి వచ్చిన నారా లోకేష్‌కు చేదోడుగా ఉండి వివిధ పార్టీల నాయకులను కలిసి వారి మద్దతును సాధించడంలో కీలక కృషి చేశారు. చంద్రబాబు ఎప్పుడు ఢిల్లీ వచ్చినా రామ్మోహన్‌నాయుడును తన వెంట పెట్టుకునేవారు.

### పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడిగా...

ఒక పార్లమెంట్ సభ్యుడిగా సభలో ప్రజా సమస్యలపై ఎప్పుడూ గొంతు విప్పుతూనే వివిధ పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడిగా కూడా పనిచేసి వివిధ రకాల అంశాలపై పట్టును సంపాదించారు. వ్యవసాయం, పశుపోషణ, ఫుడ్ ప్రొసెసింగ్‌పై నియమించిన స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా పని చేశారు. అదే విధంగా రైల్వేస్ మరియు హెూమ్ ఎఫైర్స్‌పై నియమించిన స్టాండింగ్ కమిటీలోనూ సభ్యుడిగా పని చేశారు. పర్యాటక, సాంస్కృతిక మంత్రిశాఖ ఏర్పాటు చేసిన సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. వెనకుబడిన వెనుకాల సంక్షేమంపై ఏర్పాటు చేసిన కమిటీలోనూ సభ్యుడిగా పని చేశారు.

### అవార్డులు, విజయాలు

ఎంపీగా విశిష్ట సేవలు అందించినందుకు గాను రామ్మోహన్‌నాయుడికి 2020లో సన్సద్ రత్నా అవార్డును ఇచ్చి గౌరవించారు. 18వ లోకసభ ఎన్నికల్లో 3.27 లక్షల మెజార్టీతో ఘన విజయం సాధించారు.

### వ్యక్తిగత జీవితం

రామ్మోహన్‌నాయుడు 2017లో శ్రావ్యను పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక పాప ఉంది. కుటుంబానికి కట్టుబడ్డ వ్యక్తి. అంతేకాదు తన భార్య ప్రసవం సమయంలో లోకసభ సమావేశాలకు హాజరవ్వకుండా మెటర్నటీ సెలవు తీసుకొని లింగ సమానత్వంపై ఆరోగ్యకరమైన చర్చకు తెరతీశారు. లైంగిక విద్య అవసరాన్ని పార్లమెంట్‌లో చర్చించిన మొట్టమొదటి ఎంపీ రామ్మోహన్‌నాయుడు. శానటరీ ప్యాడ్‌లపైన జీఎస్‌టీని తొలగించాలని ఆయన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ఇష్టాలు, అలవాట్లు

రామ్మోహన్‌నాయుడికి ఫోటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. కాలేజీ రోజుల నుండే ఈ వ్యాపకంలో ఉండేవారు. క్రీడలంటే కూడా చాలా ఇష్టం. ముఖ్యంగా బాస్కెట్‌బాల్, క్రికెట్‌ను బాగా ఆస్వాదిస్తారు.

ఎలమంచిలి నియోజకవర్గంలో అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం గ్రామంలో ఎన్టీఆర్‌కి జయంతి సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేసిన టీడీపీ నేతలు లాలం రాజు, ఎంపీటీసీ నీరుకొండ నర్సింగరావు, రాజాన విజయ్, యాండ్రా అప్పలనాయుడు, కాళ్ళ రాజబాబు, చిప్పల ప్రసాద్, అడిగర్ల దేవుడు, లాలం శాంతి, లాలం సురేష్, తుమ్మల సురేష్, పోలవరపు దుర్గారావు తదితరులు

# కిషన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం..



సంఘ కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కిషన్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర మంత్రి స్థాయికి చేరుకు న్నారు. కిషన్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కందు కూరు మండలం తిమ్మాపురం గ్రామంలో జూన్ 15, 1964లో జన్మించారు. టూల్ డిజైనింగ్ లో డిప్లొమా చేశారు. 1977లో జనతా పార్టీలో చేరారు. అంతకుముందు సంఘ్ కార్యకర్తగా ఉన్నారు. 1980లో రంగారెడ్డి జిల్లా బీజేపీ యువమోర్చా కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2001లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారిగా, 2004లో భారతీయ జనతా యువమోర్చా జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. బీజేపీలో కీలక నేతగా ఎదిగిన కిషన్ రెడ్డి తొలిసారి 2004లో హిమాయత్ నగర్ శాసనసభ నుంచి పోటీ చేసి గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా 2009లో అంబర్ పేట నుంచి పోటీ చేశారు. అక్కడా విజయం సాధించారు. 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం తెలంగాణా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతూ ఇటీవల ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ నాలుగు స్థానాలు నుండి 8 స్థానాలకు పెరగడంలో కీలక పాత్ర పోషించారు.

2014లో మరో అవకాశం వచ్చింది. 2014 ఎన్నికల్లో అంబర్ పేట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి మళ్లీ గెలుపొందారు. 2016 నుంచి 2018 వరకు అసెంబ్లీలో బీజేపీ శాసనసభాపక్ష నేతగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో అంబర్ పేట నుంచి పోటీ చేసిన కిషన్ రెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఇందులో గెలవడమే కాకుండా కేంద్రంలో మంత్రి పదవి కూడా దక్కింది. ఇటీవలి వరకు, అతను కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రిగా కూడా పనిచేశారు.

# విద్యార్థి సంఘ నేత నుండి కేంద్ర మంత్రి దాకా..



అమరావతి, చైతన్యరథం: తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ నేతగా పేరుబడ్డ బండి సంజయ్ అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత శిఖరానికి చేరుకున్నారు. కరీంనగర్ పట్టణంలో 1971 జులై 11న నర్సయ్య, శకుంతుల దంపతులకు జన్మిం చిన బండి సంజయ్ 12 ఏళ్ల వయస్సుకే ఆర్‌ఆర్‌ఎస్ పట్ల ఆకర్షితుడయ్యారు. అఖిల భారత విద్యార్థి పరిషత్‌లో క్రియాశీలకంగా పనిచేస్తూ కరీంనగర్ పట్టణ అధ్యక్షుడిగా, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత ఏబీవీపిలో జాతీయ కార్యదర్శి స్థాయి వరకు ఎదిగారు. ఇదే సమయంలో బీజేపీలోనూ చురుకైన నేతగా వ్యవహరించారు. 2005లో కరీంనగర్ మున్సిపాల్టీ 48వ కౌన్సిలర్‌గా సంజయ్ ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2019 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఈ మధ్యలో రెండుసార్లు 2014, 2018లో కరీంనగర్ ఎమ్మెల్యే సీటుకు పోటీ చేసినప్పటికీ ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఉద్దండులైన బిఆర్‌ఎస్‌కు చెందిన వినోద్‌కుమార్, కాంగ్రెస్‌కు చెందిన పొన్నం ప్రభాకర్‌తో పోటీపడి కరీంనగర్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. అప్పటి నుండి సంజయ్ పేరు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో వినిపించడం ప్రారంభమయ్యింది. 2019 ఎన్నికల తర్వాత సంజయ్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. ఆ కాలంలో ఆయన దూకుడుగా వ్యవహరిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించి రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలకు కృషి చేశారు. 2023లో ఆయన్ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తప్పించి జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని ఇచ్చారు. 2024 ఎన్నికల్లోనూ కరీంనగర్ ఎంపీ స్థానం నుండి పోటీ చేసి గెలుపోందడంతో ఆయన్ను కేంద్ర మంత్రి పదవి వరించింది. బండి సంజయ్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

# కార్యకర్త స్థాయి నుండి కేంద్ర మంత్రి వరకు బీజేపీ ఎంపీ శ్రీనివాస వర్మ ప్రస్థానం

అమరావతి: భాజపాకు చెందిన నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మను అదృష్టం వరించింది. మొదటిసారి ఎంపీగా గెలిచిన ఆయనకు మోదీ కేబినెట్‌లో చోటు లభించింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి గూడూరి ఉమాబాలపై 2.78లక్షల ఓట్ల మెజార్టీతో శ్రీనివాస వర్మ ఘన విజయం సాధించారు. శ్రీనివాస వర్మ దశాబ్దాలుగా భాజపాకు సేవలందిస్తున్నారు. 1988లో ఆ పార్టీ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించారు. 1992-95లో జిల్లా యువమోర్చా అధ్యక్షుడిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు రెండు పర్యాయాలు భాజపా పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. 2014లో భీమవరం పురపాలక వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఇన్‌ఛార్జి చైర్మన్‌గానూ సేవలందించారు. తాజాగా నరసాపురం నుంచి ఎంపీగా ఘన విజయం సాధించిన నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో బెర్తు ఖరారైంది.



# పెను సంచలనం పెమ్మసాని



అమరావతి, చైతన్యరథం: అమెరికాలో పెద్ద వైద్యుడిగా పేరు సంపాదించిన పెమ్మసాని చంద్రశేఖర్ ఏపీ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ నుంచి ఎంపీ టికెట్ తెచ్చుకున్నారు. నామినేషన్ వేసిన తర్వాత అఫిడవిట్‌లో ఆయన ఆస్తుల విలువ చూసి అంతా ఆశ్చర్యపోయారు. ఓ సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి వేలకోట్లకు అధిపతి కావడంతో ఏపీ రాజకీయాల్లో పెమ్మసాని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతేకాదు.. రాజకీయ సభల్లో ఆయన ప్రసంగాలు ప్రజలందరినీ ఆకట్టుకునేవి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పెమ్మసాని చంద్రశేఖర్ ప్రజల దృష్టిని ఆకర్షించారు. గుంటూరు ఎంపీగా పెమ్మసాని గెలుపొందారు. ఎన్నికల ఫలితాల తర్వాత దేశవ్యాప్తంగా పెమ్మసాని పేరు చర్చనీయాంశమవుతోంది. ఎంపీగా గెలిచిన ఆయనకు మోదీ కేబినెట్‌లో బెర్త్ కన్ఫర్మ్ అయింది. అసలు ఈ పెమ్మసాని చంద్రశేఖర్ ఎవరు? ఆయన ఎలా రాజకీయాల్లోకి వచ్చారు అని అందరూ చర్చించుకుంటున్నారు.

### సామాన్య కుంటుంబం నుంచి...

పెమ్మసాని చంద్రశేఖర్ మార్చి 7, 1976లో గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని బుర్రిపాలెంలో ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన చిన్నతనంలో ఎలాంటి హంగులు ఆర్భాటా లేకుండా సాధారణమైన జీవితాన్ని గడిపారు. బాల్యంలో కొంతకాలం పాటు నరసరావుపేటలో ఉన్నారు. ఆయన చిన్నప్పటి నుంచి మంచి ప్రతిభను కనబరిచేవారు. 1991 లో పదోతరగతి, 1993లో ఇంటర్ పూర్తిచేస్తారు. డాక్టర్ కావాలనే లక్ష్యంతో1993-94లో ఎంబిబిఎస్ ఎంట్రన్స్‌లో 27వ ర్యాంకు సాధించి హైదరాబాద్ ఉస్మానియాలో సీటు సాధించారు. ఓ సాధారణ మధ్య తరగతి రైతు కుటుంబంలో పుట్టి, ప్రభుత్వ పాఠశాలల్లో కష్టపడి చదువుకుని విదేశాలకు వెళ్లారు. అక్కడ తన ప్రతిభతో వ్యాపారం రంగంలో రాణించి నేడు కోట్ల రూపాయిలకు అధిపతి అయ్యారు. కేవలం కోట్లు సంపాదించడమే కాదు.. తన సంపాదనలో కొంత భాగాన్ని పేద ప్రజల కోసం వినియోగిస్తూ విరివిగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తాను పుట్టిన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలనే ఏకైక లక్ష్యంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు.

### అమెరికాకు వెళ్లి...వ్యాపార వేత్తగా ఎదిగి...

ఉస్మానియాలో వైద్య విద్యను అభ్యసించిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోసం 2000 సంవత్సరంలో అమెరికాకు వెళ్లారు. పీజీ పూర్తి చేసిన అనంతరం అక్కడే ప్రపంచ ప్రసిద్ధి చెందిన జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీలో ఐదేళ్లపాటు టీచింగ్ ఫ్యాకల్టీగా కొనసాగారు. మరోవైపు మెడికల్ లైసెన్స్ ఎగ్జామ్స్ కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు సహాయం చేసేవారు. తనలా వైద్య విద్య అభ్యసించాలన్న ఎంతో మంది కలను నెరవేర్చాలనే లక్ష్యంతో తాను సొంతంగా తయారు చేసిన నోట్స్‌ను తక్కువ ధరకు ఆన్ లైన్‌లో అందించేవారు. డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రయత్నానికి మంచి ఆదరణ లభించింది. అదే సమయంలో చంద్రశేఖర్ రాసిన మెటీరియల్ కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో విద్యార్థుల కోసం యూ వరల్డ్ ఆన్‌లైన్ ట్రైనింగ్ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా నర్సింగ్, ఫార్మసీ, లా, వాణిజ్యం, అకౌంటింగ్ విభాగాల్లో లైసెన్సింగ్ పరీక్షలకు శిక్షణ ఇచ్చేవారు. వారికి అద్భుతమైన మెటీరియల్ అందించేవారు. అలా తన వ్యాపారాన్ని పెంచుకుంటూ అమెరికాలో ఒక యువ వ్యాపారవేత్తగా ఎదిగారు. ఇప్పటికీ వైద్య పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థులకు యు వరల్డ్ ద్వారా ఆయన శిక్షణ అందిస్తున్నారు. ఈ వ్యాపారం ద్వారా ఆయన కోట్ల రూపాయిలను సంపాదించగలిగారు.

### జన్మభూమి రుణం తీర్చుకుంటూ..

చంద్రశేఖర్ అమెరికా ఫిజీషియన్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉంటూ.. పెమ్మసాని ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి ఎన్నారైలకు ఉచిత వైద్య సేవలు అందించారు. వైద్య బీమా లేక ఇబ్బందులు పడుతున్న ప్రవాస భారతీయులకు అండగా నిలిచారు. తన వ్యాపారంలో రాణించిన ఆయన పుట్టిన గడ్డ కోసం ఏదైనా చేయాలనే ఉద్దేశంతో స్వదేశానికి తిరిగి వచ్చారు. పల్నాడు ప్రాంత వాసుల ప్రధాన సమస్యగా ఉన్న నీటి కొరతను తీర్చారు. దీనికోసం సొంత డబ్బులతో వందల సంఖ్యలో బోర్‌వెల్స్, ఆర్‌వోప్లాంట్స్ ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను అందించేలా బెస్ట్ బెరీ స్కూల్‌ను ప్రారంభించారు. పెమ్మసాని ట్రస్టు ఏర్పాటు చేసి.. పేద ప్రజలకు, స్వచ్ఛంద సంస్థలకు ఆర్థిక సాయం అందిస్తూ వస్తున్నారు. రాజకీయాలపై ఆసక్తితో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన గుంటూరు లోక్‌సభ స్థానంనుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

చైతన్యరథం

# జగన్ రెడ్డిపై ఎన్నికల్లో
# తిరుగు బావుటా ఎగురవేసిన గిరిజనులు

- 12 న ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి
- టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. ధారు నాయక్



అమరావతి (చైతన్యరథం) : రాష్ట్రంలో కూటమి గెలిచిన 5 గిరిజన నియోజవర్గాల్లోనే కాకుండా మిగిలిన 159 నియోజకవర్గాలలో సైతం టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు మద్ద తు తెలిపిన గిరిజన ఓటర్లకు పార్టీ తరపున ధన్య వాదాలు తెలియజేస్తున్నామని, అదే స్ఫూర్తితో ఈ నెల 12 న గన్నవరంలో జరగనున్న తెదేపా అధినేత చంద్రబాబు నాయుడి ప్రమాణస్వీకా రానికి పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం తెలియజేయాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. ధారు నాయక్ గిరిజ నులను కోరారు. ఈ నెల 12 రాష్ట్ర చరిత్రలోనే ఒక సువర్ణ అక్షరాలతో లిఖించే దినంగా మిగిలిపోనుందని, దళిత- గిరిజన, బడుగు-బల హీన వర్గాల ప్రభుత్వం రాష్ట్ర పగ్గాలు చేపట్ట బోతోందని ఆనందం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిన 16 గిరిజన సంక్షేమ పథకాలు పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రశ్నించిన గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి వేధించారని, నా ఎస్సీలు, నా ఎస్టీలు అన్న జగన్ రెడ్డి మోసపూరిత మాటలతో గిరిజనులు మోసగించ లేకపోయారని, జగన్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి రాజన్నదొరలు కారణంగా గిరిజనులు 30 ఏళ్లు వెనక్కు వెళ్లారని..చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాబోయే కూటమి ప్రభుత్వంలో గిరిజనులకు పూర్వవైభవం రానుందని ఆశా భావం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను చట్ట బద్ధంగా ఎత్తివేస్తామని, గిరిజనులపై అక్ర మంగా, అన్యాయంగా దాడులు చేసిన వైకాపా రౌడీ మూకలను కూటమి ప్రభుత్వంలో న్యాయ స్థానాలు ముందు నిలబెడుతామని హెచ్చరించా రు. కూటమి ప్రభుత్వంలో దళితులు, గిరిజ నులు, బీసీలు, మైనారిటీలు, మహిళల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటా మన్నారు.

జగన్ రెడ్డి ప్రభుత్వంలో గిరిజన పాఠశాలల్లో విద్యాప్రమాణాలు దిగజారిపోయా యని, బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పథకం రద్దు చేసి 17 వేల మంది గిరిజన విద్యార్థులను రోడ్డునపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రైబల్ సొసైటీలలో పనిచేసే ఉపాధ్యాయులకు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పదవీవిరమణ వయసు పెంచలేదన్నారు. ఆ స్థానాల్లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయ స్థానాలను భర్తీ చేయ లేదన్నారు. గురుకులాలలో 1800 టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని. టీడీపీ హయాంలో 1100 టీచర్ పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చినప్పటికీ జగన్ రెడ్డి వాటిని అమలు చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని సమస్యలను పరిష్కరించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు గిరిజనులు తమ వంతు సహకారంగా కూటమి ప్రభుత్వాన్ని బలపరచాలని ధారు నాయక్ కోరారు.

## గ్రామాల్లో ఘర్షణల జోలికి వెళ్లవద్దు

- పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ పిలుపు
- వేలాదిగా తరలివచ్చి శుభాకాంక్షలు వెల్లువ



రాప్తాడు (చైతన్యరథం): గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఎవరూ విజయోత్సాహంలో ఘర్షణల జోలికి వెళ్లవద్దని మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాలు వెలువడి దాదాపు వారం రోజులు కావస్తున్న పరిటాల ఇంటి వద్ద సందడి మాత్రం ఏ మాత్రం తగ్గడం లేదు. ఓవైపు వెంకటాపురం.. మరోవైపు అనంతపురం క్యాంపు కార్యాలయం వద్ద జనసంద్రం కొనసాగుతోంది. నియోజకవర్గంలోని అన్ని మండలాలు నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రామగిరి సర్కిల్ పోలీసు అధికారులతో పాటు నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న అభిమానులు, కార్యకర్తలు కూడా పరిటాల ఇంటి వద్దకు తరలిరావడంతో అక్కడ ఒక సందడి వాతావరణం నెలకొంది. మరోవైపు ఇతర జిల్లాల నుంచి కూడా నాయ కులు కార్యకర్తలు రావడంతో పరిటాల ఇంటి వద్ద కోలాహలం నెల కొంది. ప్రతి ఒక్కరూ శాలువాలు, పూలహారాలతో పరిటాల సునీతతో పాటు ధర్మవరం ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ను సన్మానిస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. తమకు శుభాకాంక్షలు తెలిపేందుకు తరలి వచ్చిన ప్రతి ఒక్కరిని పరిటాల సునీత, శ్రీరామ్ ఇద్దరూ ఆప్యా యంగా పలకరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల విజయోత్సహంలో పార్టీ శ్రేణులంతా ఉండటం సంతోషంగా ఉంద న్నారు. అయితే ఎవరూ గ్రామాల్లో ఘర్షణల జోలికి వెళ్ళవద్దన్నారు. ఘోర పరాభవంలో ఉన్న వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగవచ్చుని.. కానీ మీరు మాత్రం సంయమనంతో ఉండాలని వారు సూచించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలన్నదే పార్టీ సిద్ధాంతం, మా లక్ష్యం కూడా అని వారు స్పష్టం చేశారు. మరోవైపు గ్రామాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేయాలన్నది మనము ముందస్తుగానే ఒక ప్రణాళికతో ఉండాలని గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

# గత ఐదేళ్ళుగా ఐ అండ్ పి.ఆర్ లో స్కాములే...స్కాములు

- నీలి మూకకే అక్రిడేషన్లు కట్టబెట్టిన అధికారులు
- సజ్జల కనుసన్నల్లోనే అక్రిడేషన్ల స్కాముల ప్రక్రియ
- వైసీపీ కార్యకర్తలే మీడియా ప్రతినిధులంటూ ధృవీకరించిన ఉన్నతాధికారి
- హెూల్ సేల్ గా స్టేట్ అక్రిడేషన్లు అమ్ముకున్న ఉన్నతాధికారి అండ్ కో
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్



చిత్తూరు (చైతన్యరథం): రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ(ఐ అండ్ పీ.ఆర్) గత ఐదేళ్లుగా స్కాములకు కేరాఫ్ అడ్రస్ గా వెలుగొన్నదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. పెన్ను, పేపరు సరిగా పట్టుకోవడం రాని రౌడీలకు, గూండాలకు, వైసీపీ కార్యకర్తలకు, మంత్రుల అనుచరులకు మీడియా ప్రతినిధుల పేరిట అక్రిడేషన్లను ఫలహారం పంచినట్లు పంచారు. హెూల్ సేల్ గా జిల్లా అక్రిడేషన్ ను రూ.10వేలు, స్టేట్ అక్రిడేషన్ ను రూ.20వేలకు ఐ.అండ్ పీ.ఆర్ కు సంబంధించిన ఆ ఉన్నతాధికారి అండ్ కో అమ్ముకుని కాసుల వర్షంలో తడిసి ముద్దయ్యారు. ఆ ఉన్నతాధికారికి వైసీపీ గ్యాంగ్ ఫోన్ చేసి "హలో నేను వైసీపీ మంత్రిని...వైసీపీ ఎమ్మెల్యేని...మా వాళ్లు మీ దగ్గరకు వస్తారు..వాళ్లకు అక్రిడేషన్లు ఇచ్చెయ్..అని చెబితే చాలు..ఎస్ బాస్...ఓకే బాస్... మీరు ఏం చెబితే అదే బాస్...డోంట్ వర్రీ...ఐయామ్ ఆల్వేస్ ఫర్ వైసీపీ" అని బ్లా బ్యాచ్ సేవలో తరించాడు ఆ ఉన్నతాధికారి అతని టీమ్ సభ్యులు. ఉదాహరణకు గుడివాడ గడ్డం మంత్రి తన అనుచరులకు దాదాపు 40కి పైగా అక్రిడేషన్లు ఇచ్చారంటే సంబంధిత ఉన్నతాధికారి వైసీపీకి ఏ స్థాయిలో స్వామిభక్తి చాటుకున్నాడో ఇట్టే అర్థమవుతుంది. అదేవిధంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపు 1700పైబడి ఉన్న అక్రిడేషన్లలో అత్యధిక అక్రిడేషన్లు కంటికి కనిపించని పత్రికలను అడ్డుపెట్టి వైసీపీ గ్యాంగ్‌కు ఇచ్చినవేనని పత్రికాలోకం కోడైకూస్తోంది. అత్యధిక సర్క్యులేషన్ కలిగినటువంటి పత్రికలను అధికారాన్ని అడ్డుపె ట్టుకుని ప్రక్కనపెట్టి, కేవలం పీడీఎఫ్ పేపర్లు నడిపే వైసీపీ గ్యాంగ్‌కు మాత్రమే అక్రిడేషన్లు ఇవ్వడం నిజమైన పత్రికా విలేకరులు విస్తుపోయారనడంలో ఆశ్చర్యం లేదు.

కృష్ణజ్యోతి, రియల్ న్యూస్, నవజనత, వార్త ప్రభ వంటి పత్రికలు సమాజంలో కంటికి కనిపించక పోయినా ఈ పత్రికల్లో పనిచేస్తున్నామంటూ వైసీపీ గ్యాంగ్ అక్రిడేషన్లకు అప్లికేషన్లు పెట్టుకుంటే కళ్ళుమూసుకుని సంబంధిత అధికారులు స్టేట్ అక్రిడేషన్లు మంజూరు చేసి, కాసులను జేబుల్లో నింపుకున్నారని తోటి పత్రికా విలేక రులు బల్లగుద్ది చెబుతున్నారంటే ఐ అండ్ పి.ఆర్ శాఖలో స్కాములు ఏ స్థాయిలో జరిగాయో ఊహించు కోవ చ్చు. ఇదిలా ఉంటే వైసీపీ కార్య కర్తలకు ఇచ్చిన అక్రిడేషన్లలో ఓ మత లబు ఉంది. వాళ్లు తీసుకున్న అక్రి డేషన్ ఒక పత్రికలో...పనిచేసేది మరొక ఛానల్ లో. ఇలాంటి ఎన్నెన్నో విడ్డూరాలకు కేంద్ర బిందువుగా ఐ అండ్ పీ.ఆర్ శాఖ నిలిచింది. దీనికి గల కారణం సజ్జల రామకృష్ణారెడ్డి, ఐ అండ్ పి.అర్ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి, ఉమ్మడి కృష్ణాజిల్లా వైసీపీ నాయకులు మంత్రులు, మాజీ మంత్రులు వగైరా. ఈ విధంగా ఐ అండ్ పి.ఆర్ ను తమ జేబు సంస్థలా మార్చుకున్న వైసీపీ నేతలకు, వాళ్ల తాబేదార్లలా పనిచేసిన అధికారులకు అతి త్వరలోనే చుక్కెదురు కాబోతుందని స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి.

# అన్న ఎన్టీఆర్ ని టచ్ చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు

- గుంటూరు నగరంలో ఎన్టీఆర్ స్టేడియం పేరు మార్పు శిలాఫలకాల కూల్చివేత
- ఎన్టీఆర్ జిమ్ గా నామకరణం చేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక
- రాష్ట్ర బ్రాహ్మణ అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ




అమరావతి (చైతన్యరథం) : ఎవరైనా అన్న ఎన్టీఆర్ నీ టచ్ చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ హెచ్చరించారు. నగరం నడిబొడ్డున అన్న నందమూరి తారక రామారావు పేరుతో ఎన్టీఆర్ స్టేడియం గా ఏర్పాటై ప్రతి రోజూ ఎంతో మందికి నడక, వ్యాయామంతో ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ నగర వాసుల దినచర్యలో భాగమైన ఎన్టీఆర్ స్టేడియం పేరు మార్చాలని వైసీపీ సైకోలు చేసిన కుట్రలను ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ చైతన్య వేదిక న్యాయ పోరాటం ద్వారా సమర్థవంతంగా తిప్పికొట్టడం జరిగింది. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎన్టీఆర్ స్టేడియంలో ఉన్న వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు మధ్య దొడ్డిదారిన నిబంధనలకు విరుద్ధంగా గుట్టుగా వైసీపీ మూకలు ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం జరిగింది. శిలాఫలకాల తొలగింపు కార్యక్రమంలో స్థానిక వాకింగ్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఆ నూతన భవనానికి ఎన్టీఆర్ జిమ్ గా నామకరణం చేసి ఎన్టీఆర్ జిమ్ అనే పెద్ద అక్షరాలతో బిల్డింగ్ బయట బోర్డు అమర్చడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ లో ఉన్న ఎన్టీఆర్ స్టేడియం లో నూతన భవనానికి వైయస్సార్ జిమ్ మరియు వైయస్సార్ స్టేడియం గా పేరు మార్చేందుకు కుట్ర పన్నడం దుర్మార్గ చర్య అన్నారు. ఇందుకోసం ఒక నూతన భవనం నిర్మాణం చేపట్టారు. దీనిపైన వారి కుట్రను పసి గట్టిన బ్రాహ్మణ చైతన్య వేదిక ఆధ్వర్యంలో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడం జరిగింది.

ఈ రోజున వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు గుంటూరు నగరంలో ప్రయత్నం చేస్తే దాన్ని బ్రాహ్మణ చైతన్య వేదిక తీవ్రంగా అడ్డుకుందని శ్రీధర్ తెలియజేశారు. ఎన్టీఆర్ పట్ల ఎవరు అవమానకరంగా ప్రవర్తించినా, పరిణామాలు ఇలానే తీవ్రంగానే ఉంటాయని శ్రీధర్ హెచ్చరించారు.

తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి దురహంకారానికి ఇది నిదర్శనం అయనకు ప్రజలు ఎన్నుకున్నది కట్టడాలు కూల్చేయడానికి పేర్లు మార్చడానికేనా అని సాయి ప్రశ్నించారు. నరసరావుపేటలో కూడా జగన్ ప్రభుత్వంలో డాక్టర్ కోడెలకు క్రీడా ప్రాంగణాన్ని పేరు మార్చి వైయస్సార్ పేరు పెట్టారని నిన్నటి రోజున అక్కడ స్థానికులు పార్టీ వారు కలసి వైఎస్ఆర్ పేరుని తీసివేసి కోడెల పేరు పెట్టడం జరిగిందని, ఎప్పటికైనా సరే వైసీపీ నాయకులు బుద్ధి తెచ్చుకొని ప్రజా సేవ చేయాలని లేని పక్షంలో ఇప్పుడున్న 11 సీట్లు కూడా పోయి సున్నా సీట్లు వచ్చే పరిస్థితి ఉందని సాయి తెలియజేశారు.

# మోడుబారుతున్న పసి ప్రాయం



లేత చేతులు రాళ్ళు కొడుతున్నాయి. పాలు కారే వయస్సు ప్రమాదకర పరిస్థితుల్లో పరిశ్రమల్లో పని చేస్తుంది. బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన బాల్యం బీడీ లు చుటుతోంది. బట్టీల్లో బండ చాకిరికి బలై పోతుం ది. చదువు లేదు. ఆటలు లేవు. సరైన పోషకా హారం అందదు. పిల్లలు శ్రామిక యంత్రాలుగా మారి పోయిన సామాజిక దురవస్థ ప్రపంచ వ్యాప్తంగా ఉంది. అందులోనూ మన దేశంలో తీవ్రమైన పరిస్థితి ఉంది.

"పల్లెటూరి
పిల్లగాడా పసులగాసే మొనగాడా
పాలు మరచి ఎన్నాళ్ళయ్యిందో ఓ పాల బుగ్గ
ల జీతగాడా కొలువుదీరి ఎన్నాళ్ళయ్యిందో" అంటూ తొలి తరం ప్రజాకవి సుద్దాల హనుమంతు రాసిన ఈ పాట భారతదేశంలో శతాబ్దాల తరబడి బాలకార్మిక వ్యవస్థ లో మగ్గిపోతున్న బాలల ముఖ చిత్రాన్ని ప్రతిబింబిస్తుంది. బడిలో ఉండాల్సిన పిల్లలను, ఆట పాట లతో గడపాల్సిన బాల్యాన్ని బందీ చేయడం ఒక అనా గరిక చర్య. ఇది మన భారతదేశ సమస్య మాత్ర మే కాదు. ప్రపం చంలో అభివృద్ధి చెందు తున్న దేశా లకు సంబంధించింది కూడా.

## బాలకార్మిక వ్యవస్థ అంటే..

పుట్టుక నుంచి కౌమారం వరకు బాల్యం. బంగారు భవిష్యత్తుకు పునాది పడే దశ. ఈనాటి బాలలే రేపటి భారత నిర్మాణ సారథులు. అలాంటి వారిని చదువులకు, ఆటలకు దూరం చేసి శ్రామిక యంత్రాలుగా మార్చడాన్ని బాలకార్మిక వ్యవస్థ అంటారు. సాంఘిక, ఆర్థిక కారణాల వల్ల కొంత మంది బాలలు కార్మికులుగా మారుతున్నారు.

## పసిప్రాయంపై పనిభారం



నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు భారత తొలి ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ. కానీ వాస్తవంలో మాత్రం బాలలు పౌరులవ్వడం కంటే ముందు 'కార్మికులవుతున్నారు. బాల కార్మికులకు వ్యతిరేకంగా ప్రపంచమంతా గొంతెత్తుతున్నా ఏటా వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూనే ఉంది. మనదేశం జనాభావృద్ధిలోనే కాదు... బాల కార్మికులు అధికంగా కలిగిన దేశంగానూ నిలిచింది. బాలకార్మికుల సంఖ్యపై ప్రభుత్వం వద్ద ఎలాంటి గణాంకాలు లేవు. బాలకార్మికులను పర్యవేక్షిస్తున్న జాతీయ బాలకార్మిక ప్రాజెక్టు (ఎన్‌సీఎల్‌పీ)ను 2016లో సమగ్ర శిక్షా అభియాన్‌లో విలీనం చేయడంతో వారికి సంబంధించిన రికార్డులేవీ లేవని, వాటికోసం కొత్తగా చేసే జనగణన దాకా వేచి చూడాల్సిందేనని కార్మిక మంత్రిత్వ శాఖ గతంలో తెలిపింది. కానీ యూనిసెఫ్ నివేదిక ప్రకారం దేశ కార్మికశక్తిలో దాదాపు 4 కోట్ల మంది బాలలే ఉన్నారని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 16కోట్లకు పైగా బాలకార్మికులు ఉన్నారని ఇంటర్‌నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ చెబుతోంది. బాల కార్మికుల సంఖ్య పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది పేదరికం. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం కూడా పిల్లల జీవితాలు ప్రభావితం చేస్తోంది. ఈ సమస్య నిర్మూలనకు ఏటా మే 12న బాలకార్మికుల వ్యతిరేకదినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

14ఏళ్లలోపు పిల్లలను పనిలో నియమించడం అనేది క్రిమినల్ నేరం. ఒకవేళ నియమిస్తే మొదటిసారి యజమానికి 3నెలల కారాగార శిక్షతోపాటు జరిమానా విధిస్తారు. పిల్లలు వయసుకు మించి బరువులు ఎత్తడంవల్ల వారి శారీరక ఎదుగుదల నిలిచిపోవడం లేదా శరీర భాగాలు ఛిన్నంగా మారిపోతాయి. అలాగే ఏదైనా పనిలో నిమగ్నమవ్వడంతో వారి మానసిక ఎదుగుదల పూర్తిగా నిలిచిపోతుంది. వీటిని దృష్టిలో ఉంచుకొని బాల కార్మికుల వ్యతిరేక చట్టాన్ని రూపొందించారు. పేదరికం ఉన్నంతకాలం బాల కార్మికులను నిర్మూలించడం ఆచరణాత్మకం కాదని దీంతో దేశ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని 1979లో నియమించిన గురుపాదస్వామి కమిటీ కొన్ని సిఫార్సులు చేసింది. వీటి ఆధారంగా కేంద్రం 1986లో బాలకార్మిక నిషేధ చట్టం తీసుకొచ్చింది. 14 ఏళ్లలోపు బాలలను ఏదైనా పనిలో నియమించడాన్ని పూర్తిగా నిషేధించింది.

పేదరికం, చదువే కాకుండా... వలసలు, సామాజిక నిబంధనలు, తల్లిదండ్రులకు సరైన ఉద్యోగావకాశాలు లేకపోవడం వంటివి కూడా బాలల జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అలాగే పిల్లల సంపాదన కుటుంబ మనుగడకు కీలకమని తల్లిదండ్రులు భావించడం కూడా పిల్లలను బడికి దూరం చేస్తోంది. ఈ సమస్యకు కారణాలు.



**పేదరికం:** భారతదేశంలో వారి చాలని ఆహారాన్ని తిని ఆకలి కడుపుతోనే ఎక్కువ మంది గడిపేస్తున్నారని అనేక సర్వేల్లో తేలింది. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను పాఠశాలలకు బదులుగా పనికి పంపుతున్నారు. తక్కువ ఖర్చుకి పిల్లలతో ఎక్కువసేపు పనిచేయించుకోవచ్చని యజమానులు బాలలను పనుల్లో నియమించుకుంటున్నారు.

**విద్యా సదుపాయాలు:** దేశంలో ఉచితంగా చదువు బోధించే చాలా పాఠశాలలకు తగిన సౌకర్యాలు, ఉపాధ్యాయులు లేరు, ఈ అరకొర విద్యా సదుపాయాలూ బాలకార్మిక వ్యవస్థ కొనసాగడానికి కారణమని బీజీసీ నివేదిక పేర్కొంది, బాలురుతో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో బాలికలు చదువుకు దూరమవుతున్నారు. పాఠశాలల్లో కనీసం మంచినీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో బడి మధ్యలో మానేసి ఇంటి పనుల్లో, బాలకార్మికులుగా మారుతున్నారు. కొన్ని చోట్ల సామాజిక నిర్బంధాల పేరిట వారిని ఇంట్లో పనికి నియమించి వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు.



## వలసలు

పుట్టి పెరిగిన చోట తల్లిదండ్రులకు ఉపాధి లేక పట్టణాలకు, పని ఉన్న చోటుకు వెళితే చేతినిండా పని దొరుకుతుందని వలసలు వెళుతున్నారు. తీరా పట్టణాలకు వెళ్లాక అక్కడ పరిస్థితి భిన్నంగా ఉంటుంది.. వారి సంపాదనకు పిల్లల సంపాదన కూడా తోడైతేగానీ ఇల్లు గడవని పరిస్థితి నెలకొంటు ంది. పుస్తకాలు పట్టుకోవాల్సిన పసి వయసులో ఆయిల్ అంటిన పనిముట్లు పట్టుకుంటున్నారు. కొవిడ్ -19. తర్వాత పరిస్థితి మరీ తీవ్రమైంది. ఇటుకల తయారీ పరిశ్రమలో తల్లిదండ్రులతో కలిసి పనిచేసే పిల్లల సంఖ్య రెట్టింపు అయ్యింది, వారి కుటుంబ అవసరాలను తీర్చడానికి, నాలుగు వేళ్ళు కనీసం రెండుపూటలైన నోట్లోకి వెళ్లడానికి ఆనందంగా గడపాల్సిన బాల్యం కాస్తా... అంధకారం అవుతుంది. ఇప్పటికీ మెకానిక్ షాపుల్లో, పాన్ షాపుల్లో, చాయ్ దుకాణాల్లో, ఇటుక బట్టీల్లో, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్, సెంట్రింగ్ పనుల్లో వీరు ఎక్కువగా కనపడుతుంటారు. ఇలా వారిని పనికి పంపకుండా తల్లిదండ్రులు చదువు విలువ తెలుసుకొని స్కూలుకు పంపితే వారిలో నుంచి మరో 'అబ్దుల్ కలాం, బిల్ గేట్స్ వంటి వారు పుట్టుకొస్తారు. పిల్లలకు చదువు చెప్పించడం తాత్కాలికంగా కష్టం అనిపించవచ్చు. కానీ వారు ఉన్నత స్థాయికి ఎదిగాక పడిన కష్టానికి ప్రతిఫలం 100రెట్లు పొందవచ్చు.

## ఒక్క అడుగు పిల్లలవైపు

బాలకార్మిక వ్యతిరేక నినాదపు సారాంశం యజమానులకు అర్థం అవ్వాలి. దానికి తగ్గటే చట్టాలను కఠినతరం చేయాలి. బాలలకు నాణ్యమైన ప్రాథమిక విద్య, వసతులు అందించడం ద్వారా బాలలెవరూ విద్యకు, విజ్ఞానార్జనకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలి. అనాథలు జీవనోపాధి కోసం బాల్యంలోనే పనులు చేయకుండా చేయూత అందించాలి. అంతేకాదు బాలకార్మిక వ్యవస్థ కొనసాగడంలో సమాజమే కీలకంగా నిలుస్తోంది. ఎవరైనా బాలలు పనిచేస్తూ కనబడితే చూసి చూడనట్టు వెళ్ళిపోతుంటారు. పిల్లల జీవితాలను, సామాజిక పరిస్థితులను బాల కార్మిక వ్యవస్థ ఎంతగా ప్రభావితం చేస్తుందో అవగాహన లేకపోవడంతో ఇంకా ఇది ఉనికిలో ఉంది. ప్రభుత్వ విధులకు ప్రజల మద్దతు తోడైతే బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రయోగశాలలో గడపాల్సిన దేశ భవిష్యత్తు ఇలా నాశనం అయిపోవడం.. ఎంత ప్రమాదమో మనలో చాలా మందికి అర్థం కావడంలేదు. 'నేటి బాలలే రేపటి భవిష్యత్తు ' అనే వాస్తవాన్ని సమాజానికి వివరించి.. దేశ సౌభాగ్యానికి పిల్లల చదువే, వారి సరైన ఎదుగుదలే అత్యంత కీలకమని అర్థమయ్యేలా చేయాలి.

